APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 211 | పేజీలు : 04 వెల రూ. 2/- | సోమవారం 21-09-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 211 | PAGES : 04 PRICE : 2 | MONDAY 21 SEPTEMBER 2026



## ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలకు అదనపు హంగులు

- రూ.912 కోట్లతో అభివృద్ధి పనులు
- ఏపీలో విమానయాన రంగంపై కేంద్రం ప్రభుత్వం దృష్టి సారించింది
- రూ.912 కోట్లతో 4 చోట్ల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు చేపట్టింది
- విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో దాదాపు పనులు పూర్తయ్యాయి

**అమరావతి :** రాష్ట్రంలో విమానయాన రంగాన్ని మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని పెంచడంతో - మిగతా 2 లో

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

- 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' అమలు
- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' కార్యక్రమం
- హాజరైన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఏపీ విద్యావ్యవస్థ దేశంలోనే నెం.1 అవుతుందని వ్యాఖ్యలు
- త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన




**అమరావతి :** క్లాస్‌రూమ్ నుంచే సమాజంలో మార్పు సాధ్యమని, విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్. సాంకేతికతకు భారతీయ విలువలు జోడిస్తే ప్రపంచ విజేతలుగా ఎదగవచ్చని చెప్పారు. విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.కాకినాడ జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటించారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొనడానికి వచ్చిన లోకేశ్‌కి ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ ఘన స్వాగతం పలికారు.విద్యార్థులు ఆలపించిన వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులను మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన - మిగతా 2 లో

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు



- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల విజ్ఞప్తి
- విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన 370 మంది ఉపాధ్యాయులు
- ప్రతిభ, పతకాలతోనే ఉద్యోగాలు సాధించామని స్పష్టీకరణ
- స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు
- గాయాల కన్నా ఆరోపణలే ఎక్కువ బాధిస్తున్నాయని ఉపాధ్యాయుల ఆవేదన

**అమరావతి :** మెగా డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసీపీ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన - మిగతా 2 లో

### దేశవ్యాప్త 28 నుంచి 30 వరకు

# బ్యాంకుల సమ్మె




- ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన
- ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె
- బ్యాంకు పనులు ముందే పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు ఎస్‌బీఐ సూచన
- వారాంతపు సెలవులతో కలిపి ఐదు రోజుల పాటు సేవలకు అంతరాయం
- ఏటీఎం, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడి
- 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపు

**ఢిల్లీ :** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా - మిగతా 2 లో


# ఆస్కార్ రేసులో ఇళయరాజా

- ఇండియన్ మూవీ నుంచి కాదు
- ఇళయరాజా సంగీతం అందించిన సినిమా ఆస్కార్ రేసులో
- ఆయన సంగీతం అందించిన మరాఠీ చిత్రం 'గోంధల్' ఇప్పటికే భారత్ తరఫున 2027 ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీ
- 9వ అకాడమీ అవార్డ్స్‌లో బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగం కోసం శ్రీలంక నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీకి సమర్పించినట్లు చిత్రబృందం



**ఢిల్లీ :** ఇళయరాజా పేరు ఈసారి ఆస్కార్ సీజన్‌లో మరోసారి వినిపిస్తోంది. ఆయన సంగీతం అందించిన మరాఠీ చిత్రం 'గోంధల్' ఇప్పటికే భారత్ తరఫున 2027 ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. ఇప్పుడు ఆయన సంగీతంతో వచ్చిన మరో సినిమా కూడా అదే కేటగిరీ - మిగతా 2 లో


## పశ్చిమాసియాలో టెన్షన్



2 లో

- తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక
- సౌదీపై హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో కీలక హెచ్చరిక
- పశ్చిమాసియా ప్రయాణాలపై అమెరికా తన పౌరులకు కొత్త అడ్వైజరీ జారీ
- పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపం దాల్చవచ్చని ఆందోళన వ్యక్తం చేసిన యూఎస్
- రియాద్ సహా కీలక నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయని వెల్లడి
- సౌదీకి లెవెల్ 3, యెమెన్‌కు లెవెల్ 4 అడ్వైజరీ కొనసాగింపు

## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత

- నాసా వ్యోమగామి షేర్ చేసిన అద్భుత చిత్రం!
- అంతరిక్షం నుంచి అద్భుతమైన ఫొటో షేర్ చేసిన నాసా వ్యోమగామి
- ఒకే చిత్రంలో శుక్ర గ్రహం, పాలపుంత, భూమి వాతావరణం
- భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు
- అరుదైన దృశ్యంపై నెటిజన్ల నుంచి ప్రశంసల వర్షం


2 లో
Image Credit: @astro_Pettit/X



## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం - మిగతా 2 లో

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం


2 లో

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ
- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక

## 'నేను ఎవరి బాణాన్ని కాను బహుజనుల బాణాన్ని'

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్
- రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా?
- కోస్గి వేదికగా 'పాంచజన్య సంకల్ప సభ'
- అధికారంలోకి వస్తే ఉచిత వైద్యం
- యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు
- తెలంగాణ రక్షణ సేనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ :** రాష్ట్రంలో రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.నారాయణపేట జిల్లా కొండగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభలో ఆ సంస్థ చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రాజకీయాలు అంటే కేవలం బూతులు తిట్టుకోవడమేనా అని ఆమె ప్రశ్నించారు. సమాజంలో అధర్మం పెరిగి, పాలకుల వల్ల ప్రజలు ఇబ్బంది పడినప్పుడు శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించి ధర్మపోరాటానికి సిద్ధం కావాలని చెబుతాడని కవిత తెలిపారు. నేడు రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, అందుకే తెలంగాణ రక్షణ సేన కోస్గి వేదికగా పాంచజన్యం సభతో ధర్మ యుద్ధానికి దిగుతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు.సీఎం రేవంత్ రెడ్డి (జపీ =వఋఖత్ష్ర =వం.ఎం.ఎ)కి రైతులకు నీళ్లిచ్చే ఆలోచనే లేదని కవిత ఆరోపించారు. నీళ్లు, యూరియా, ధాన్యం కోసం రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటికి నిన్న పాలమూరు రైతులు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇది స్వయంకృతం!

జర్మనీ పాలకపక్షం క్రిస్టియన్ డెమాక్రటిక్ యూనియన్(సీడీయూ) అధినేత, చాన్స్‌లర్ ఫ్రెడెరిక్ మెర్జ్‌కు ఇది దుర్వార్త. ఆయనకే కాదు... దశాబ్దాలుగా జర్మనీని ఏలిన మధ్యేవాద, వామపక్షాలకు సైతం మింగుడుపడని విషయం. ఆ మాటకొస్తే యూరప్ ఖండమంతా 'కింకర్తవ్యమ'ంటూ కలవరపడుతోంది. ఉన్నట్టుండి సంభవించిన ఈ 'రాజకీయ భూకంపాన్ని' జీర్ణించుకోలేకపోతోంది. తూర్పు జర్మనీ ప్రాంతంలోని సాక్సోనీ-- అన్‌హల్ట్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తీవ్ర మితవాద పక్షం ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) సాధించిన విజయమే వీరందరికీ నిద్రలేని రాత్రులు మిగిల్చింది. జర్మనీలోని 16 రాష్ట్రాల్లో సాక్సోనీ--అన్‌హల్ట్ ఒకటి. దాదాపు 21 లక్షల 36 వేల జనాభాగల ఈ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ ఇతరచోట్లకన్నా బలంగా ఉందని అందరూ భావించినా... 83 స్థానాలున్న పార్లమెంటులో 39 స్థానాలు, 43.8 శాతం ఓట్లు సాధించి మెజారిటీ పక్షంగా అవతరిస్తుందని ఊహించలేదు. అక్కడి ప్రస్తుత పాలకపక్షం మధ్యేవాద మితవాద సీడీయూ రెండో స్థానంలోకి పోవటమే కాదు, దాని ఓట్ల శాతం 17.2కి పడిపోయింది. మిగిలిన తొమ్మిది పార్టీల తీరెలావుందో చెప్పనవసరం లేదు.రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో తీవ్ర మితవాద పక్షాలు నామమాత్రంగా ఒకటి రెండు సీట్లు గెల్చుకోవటం తప్ప ఎప్పుడూ అధికారం అంచులవరకూ రాలేదు. ఇప్పుడైనా కనీస మెజారిటీకి మూడు తక్కువొచ్చిన ఏఎఫ్‌డీని అధికారంలోకి రానిస్తారా అనే సంశయం అందరిలో ఉంది. చేతులు కలిపేందుకు వేరే పార్టీలు ముందుకు రాకున్నా, కొందరు ఎంపీలు ఫిరాయించే అవకాశం కనబడుతోంది. అన్ని పక్షాలూ అంటరాని పార్టీగా పరిగణించిన ఏఎఫ్‌డీ కొన్నేళ్లుగా జర్మనీలో తన ఉనికి చాటుకుంటోంది. కానీ సాక్సోనీ-- అన్‌హల్ట్‌లో అది వేగంగా ఎదగటాన్ని అందరూ గుర్తించారు. వలసలను వ్యతిరేకించటం మొదలుకొని అనేక అంశాల్లో దూకుడుగా పోతున్న ఆ పార్టీని జర్మనీ నిఘా విభాగం 'తీవ్ర మితవాద పక్షం'గా నిర్ధారించింది. పది రోజుల్లో మెక్లిన్‌బర్గ్ పొమెరేనియా రాష్ట్రంలో జరిగే ఎన్నికలు ఎలాంటి ఫలితాన్నిస్తాయో... మరో మూడేళ్లలో జరిగే జాతీయ ఎన్నికల నాటికి ఏమవుతుందోనని వేరే పార్టీలు వణుకుతున్నాయి. ఏఎఫ్‌డీ విజయానికి ఇతర పార్టీలు తమను తామే నిందించుకోవాలి. దశాబ్దాలుగా దేశాన్నేలినా జనం మౌలిక సమస్యల్ని పరిష్కరించటంలో, దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటంలో అవన్నీ విఫలమయ్యాయి. వెల్లువలా వచ్చిపడే వలసలను నివారించలేకపోయాయి. గతంలో జర్మన్ డెమాక్రటిక్ రిపబ్లిక్ (జీడీఆర్)గా వామపక్షాల పాలనలో ఉన్న తూర్పు ప్రాంతం... పశ్చిమ ప్రాంతంతో పోలిస్తే అన్నివిధాలా వెనకబడి వుంది. అందువల్ల అక్కడి సమస్యలు మరిన్ని రెట్లు అధికం. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం తెచ్చిన అనిశ్చితి వీటికి అదనం. రష్యాతో అనవసర వివాదం తెచ్చుకోకూడదన్నది ఏఎఫ్‌డీ అభిప్రాయం. ఈసారి ముమ్మరంగా పోలింగ్ జరగటం, ఏఎఫ్‌డీ విజయం దీని పర్యవసానమే. మిగిలిన పార్టీలతో పోలిస్తే ఏఎఫ్‌డీ సామాజిక మాధ్యమాల్లో చురుకు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడును అన్నివిధాలా పుణికిపుచ్చుకుంది. సీడీయూనూ, ఇతర పక్షాలనూ విమర్శలతో చీల్చిచెండాడుతుంటే అటు నోట మాటలేదు.ఇన్నాళ్లూ అమెరికా అడుగుజాడల్లో నడిచి, ఉగ్రవాదంపై యుద్ధం పేరిట అది సాగించిన వృథా యుద్ధాల్లో పాలుపంచుకుని ఇతర యూరప్ దేశాలతోపాటు జర్మనీ కూడా ఆర్థికంగా కుంగిపోయింది. ఆ యుద్ధాలు తెచ్చిన సంక్షోభంతోనే పలు ముస్లిం దేశాలనుంచి వలసలు అధికమయ్యాయి. అమెరికా సలహాతో యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను ఎగదోయకుంటే రష్యాతో లడాయి ఉండేది కాదు. సాక్సోనీ--అన్‌హల్ట్ ఫలితం గమనిస్తే మెజారిటీ ప్రజలు ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారనీ, అధికార సీడీయూ విధానాలపై అసంతృప్తి చెందారనీ అర్థమవుతుంది. అయితే వేరే దేశాల్లోని తీవ్ర మితవాద పక్షాల్లాగే ఏఎఫ్‌డీ కూడా పర్యావరణ విధ్వంసాన్ని అబద్ధమంటుంది. ఎల్‌జీబీటీక్యూ హక్కులకు ఆ పార్టీ పూర్తి వ్యతిరేకం. వలసలు సరేసరి. జర్మన్లకు మాత్రమే దేశం సొంతమనీ, అన్యులను రానీయొద్దనీ దాని నినాదం. నాజీ పాలనలో విద్వేషాన్నీ, మారణహోమాల్నీ చూసిన జర్మనీలో తిరిగి ఆ మాదిరి పార్టీ అందలం ఎక్కే స్థితి ఏర్పడటానికి కారణమేమిటో ఆ దేశంతోపాటు ఫ్రాన్స్, స్పెయిన్ వగైరా యూరప్ దేశాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి - వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు.ఈ సమావేశంలో టీచర్లు "అబద్ధాలు వద్దు - ఆత్మగౌరవం ముద్దు" అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబో మని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా?" అని వారు ప్రశ్నించారు. వైసీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్త 28 నుంచి 30 వరకు బ్యాంకుల సమ్మె

మొదటిపేజీ తరువాయి - బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది.యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది.సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. సమ్మెలో ఎంతమంది ఉద్యోగులు పాల్గొంటారనే దానిపై బ్రాంచ్‌ల పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపింది. అయితే, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరింది.నగదు అవసరాల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్‌లు (ఏడీడబ్ల్యూఎం), అలాగే కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీ) అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ పేర్కొంది. వీటితో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యోనో, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథాతథంగా పనిచేస్తాయని స్పష్టం చేసింది.నిధుల బదిలీ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటిని ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోవచ్చని వివరించింది. అయితే, భౌతికంగా బ్రాంచ్‌కు వెళ్లాల్సిన పనులను మాత్రం ముందుగానే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని ఖాతాదారులకు సూచించింది.

## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత

మొదటిపేజీ తరువాయి - అంతరిక్షం నుంచి మన భూమి, ఇతర గ్రహాలు ఎలా కనిపిస్తాయో వివరిస్తూ వ్యోమగాములు పంచుకునే ఛాయాచిత్రాలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. తాజాగా నాసా వ్యోమగామి డోన్ పెటిట్ పంచుకున్న ఒక అద్భుతమైన చిత్రం ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. కక్ష్య నుంచి తీసిన ఈ చిత్రంలో పలు ఖగోళ అద్భుతాలు ఒకే ఫ్రేమ్‌లో బందీ కావడం విశేషం.ఈ చిత్రంలో భూ వాతావరణంలోని ఎర్రటి కాంతుల (ఎయిర్‌గ్లో) గుండా ప్రకాశవంతమైన శుక్ర గ్రహం ఉదయిస్తున్నట్లు కనిపిస్తోంది. దిగువ భాగంలో ఊదా రంగులో మెరుస్తున్న వాతావరణ కాంతులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ ఛాయాచిత్రాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ డోన్ పెటిట్ ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు.. గ్రహం పైన పాలపుంత కనిపిస్తోంది.. కింద ఊదా రంగు మెరుపులు ప్రకాశిస్తున్నాయి.. అనంతమైన నక్షత్రాల మధ్య రెండు తపాను ప్రపంచాలు మెరుస్తున్నాయి" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఈ ఫొటో చూసిన నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "అద్భుతం" అంటూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. శుక్ర గ్రహం, పాలపుంత, భూ వాతావరణంలోని అద్భుతమైన రంగులు ఒకేచోట కనిపించడం చాలా అరుదని, ఇది కళ్లకు కనులపండువ చేసే దృశ్యమని అభిప్రాయపడుతున్నారు. అంతరిక్షం నుంచి మన గ్రహాన్ని, విశ్వాన్ని వీక్షించడం ఒక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని ఈ చిత్రం మరోసారి నిరూపించింది.

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

మొదటిపేజీ తరువాయి - రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

మొదటిపేజీ తరువాయి -
విద్యార్థులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలామ్, విశ్వేశ్వరయ్య తదితరుల పాత్రలను విద్యార్థులు ప్రదర్శించారు. వారి దేశభక్తి సందేశాలు ఆకట్టుకున్నాయి. చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతిక విలువలు, దేశభక్తిపై సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో ముచ్చటించారు. లోకేశ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశభక్తి, త్యాగధనుల స్ఫూర్తి, విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.సాంకేతికతకు భారతీయ విలువలు తోడైతే, ప్రపంచ విజేతలుగా ఎదగొచ్చని పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెద్దలను, మహిళలను గౌరవించడం గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పించాలని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావించిన మంత్రి లోకేశ్ ఈ ఏడాది లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇంటర్‌లోనూ పది వేల అడ్మిషన్లు పెరిగాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. నైతిక విలువలు కూడా తోడైతే ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీ రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్‌రూమ్ నుంచే ప్రారంభమవుతుందని ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలన్నారు.రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం వాటికి భారతీయం, నైతిక విలువలు తోడవ్వాలి' అని అప్పుడే మనం ప్రపంచ విజేతలుగా ఎదుగుతామని లోకేశ్ చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ఎదురొడ్డి నిలవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. మార్కులు తక్కువ వచ్చాయని, అనుకున్నది సాధించలేకపోయామని తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు ఉంటే ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగాలను గుర్తుంచుకుని వారు గర్వపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు."విద్య వల్ల సమాజంలో మార్పు తీసుకురావచ్చు. నాకు విద్యాశాఖను ఇవ్వాలని సీఎంను కోరాను. విద్య, ప్రభుత్వ స్కూళ్లంటే సీఎంకు చాలా ఇష్టం. విద్యావ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి. గతంలో బాపట్లలో జరిగిన మెగా పీటీఎంకు సీఎం వచ్చారు. నాడు పిల్లలకు పెట్టే భోజనమే సీఎంకు వడ్డించారు. ఈ భోజనం క్వాంటిటీ సరిపోదు, పెంచాలని సీఎం చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. ఓర్పు, సహనం, నైతిక విలువలు మనకు చాలా అవసరం. దేశం కోసం ఆలోచించాలి, దేశం కోసం త్యాగం చేయాలి.సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదని హార్డ్‌వర్క్‌తోనే మంచి స్థాయికి వెళ్లగలమని లోకేశ్ అన్నారు. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా తీసుకోవాలని తల్లిదండ్రులు తలదించుకునేలా కాకుండా తలెత్తుకునేలా చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం గత చరిత్ర మాత్రమే కాదని అది భారతీయుల వారసత్వ సంపద అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి మరింత పెరుగుతుందని చెప్పారు.స్వాతంత్ర్య పోరాటం గత చరిత్ర కాదు మన భారతీయుల వారసత్వ సంపద అని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారన్నారు. ఆ త్యాగాల విలువను తెలుసుకుని భావితరాలకు అందించాలన్నారు. గాంధీ నుంచి అంబేద్కర్ వరకు ప్రకాశం పంతులు నుంచి పొట్టి శ్రీరాములు వరకు దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయుల చరిత్రను పిల్లలకు తెలియజేయాలని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను గుర్తుంచుకోవడమని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నైతిక విలువలు చరిత్ర పట్ల గౌరవం పెంపొందించేందుకు నిర్వహించిన భారతీయం కార్యక్రమం త్యాగధనుల స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసింది.

## ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలకు అదనపు హంగులు

మొదటిపేజీ తరువాయి -
పాటు దేశీయ విమాన సర్వీసులను విస్తరించి విమాన ప్రయాణాన్ని ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ఇందుకుగానూ విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మొత్తం రూ.912.94 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినల్ భవనాలతో పాటు అనుసంధాన రోడ్లు, ప్రయాణికులకు అవసరమైన ఇతర మౌలిక వసతులు వంటి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. తిరుపతి, విజయవాడ విమానాశ్రయాల్లో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తి కావొచ్చాయి. రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో ప్రతిపాదించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.విజయవాడ విమానాశ్రయంలో రూ.473.03 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం, టెక్నికల్ బ్లాక్ పనులు దాదాపు పూర్తయ్యాయి. తుది దశ పనులు ముగిశాక ప్రయాణికులకు విశాలమైన టెర్మినల్, ఆధునిక చెక్-ఇన్, భద్రతా ఏర్పాట్లు, వేచి ఉండే హాళ్లు అందుబాటులోకి రానున్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణ చేపట్టారు.కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ భవనం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.210.61 కోట్లతో పనులు ప్రతిపాదించింది. ఇప్పటికే సుమారు 70 శాతం నిర్మాణం పూర్తైంది. అభివృద్ధి పనులు పూర్తయితే దాదాపు 16 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో కొత్త సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో భవిష్యత్తులో మరిన్ని దేశీయ విమాన సర్వీసులను నిర్వహించే అవకాశం ఉంటుంది.రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.173.28 కోట్లతో కొత్త డొమెస్టిక్ టెర్మినల్, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి పనులను ఏఏఐ ప్రతిపాదించింది. వాటిలో 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తయ్యాక సుమారు 21 వేల చదరపు మీటర్ల అదనపు స్థలం ప్రయాణికుల వినియోగానికి అందుబాటులోకి రానుంది. కొత్త టెర్మినల్ ద్వారా ప్రయాణికుల రద్దీని మరింత సమర్థంగా నిర్వహించే వీలుంటుంది.తిరుపతి విమానాశ్రయంలో రూ.55.92 కోట్లతో నిర్మించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, టెక్నికల్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో వీటిని ప్రారంభించనున్నారు. ప్రస్తుతం తిరుపతి నుంచి బెంగళూరు, ముంబయి, దిల్లీ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, బెళగావి, గోవా (శివమొగ్గ మీదుగా), కొల్హాపూర్ తదితర నగరాలకు డొమెస్టిక్ సర్వీసులు నడుస్తున్నాయి.నాలుగు విమానాశ్రయాల్లో అభివృద్ధి పనులు పూర్తయితే రాష్ట్రంలో విమాన ప్రయాణ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. కొత్త టెర్మినల్ భవనాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, విస్తరించిన మౌలిక వసతులతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

## ఆస్కార్ రేసులో ఇళయరాజా

మొదటిపేజీ తరువాయి - కోసం వెళుతోంది. అయితే ఈసారి సినిమా భారత్ నుంచి కాదు, శ్రీలంక నుంచి. ముఖ్యంగా ఇది శ్రీలంకలో రూపొందిన తమిళ చిత్రం కావడం మరో హైలెట్. అయితే ఈ సినిమా ఇంకా శ్రీలంక అధికారిక ఆస్కార్ ఎంట్రీగా ఎంపిక కాలేదు. ముందుగా అక్కడి జాతీయ సెలక్షన్స్ ప్రక్రియను దాటాల్సి ఉంది.ఇళయరాజా సంగీతం అందించిన సినిమా 'ఆంటోనీ'. ఈ సినిమాను 2027లో జరిగే 99వ అకాడమీ అవార్డ్సులో బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగం కోసం పరిశీలించేందుకు శ్రీలంక నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీకి సమర్పించినట్లు చిత్రబృందం తెలిపింది. శ్రీలంక నేషనల్ ఫిల్మ్ కార్పొరేషన్ ద్వారా ఈ ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఆస్కార్‌కు వెళ్లాలనుకునే అర్హత ఉన్న శ్రీలంక సినిమాలను ముందుగా తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. వాటిలో ఒక సినిమాను మాత్రమే దేశం తరఫున అధికారికంగా అకాడమీకి పంపనున్నారు. 'ఆంటోనీ' ఇప్పుడు ఆ ఎంపిక కోసం పోటీపడుతున్న చిత్రాల్లో ఒకటిగా ఉంది.'ఆంటోనీ' శ్రీలంక తమిళ కుటుంబ కథగా రూపొందింది. ప్రశాంతంగా జీవించాలని కోరుకునే ఆంటోనీ అనే మత్స్యకారుడి చుట్టూ కథ సాగుతుంది. అతని గతం గురించి తెలియని మరో యువ మత్స్యకారుడితో సమస్య మొదలైన తర్వాత కథ మారుతుంది. కయల్ విన్సెంట్ టైటిల్ రోల్ చేయగా, టీజే భాను ఆయన భార్య పాత్రలో నటించారు. సుదర్శన్ రవీంద్రన్, సౌమి మునసింగ్, నిశల్‌గల్ రవి, అరుళ్‌దాస్ ఇతర పాత్రల్లో కనిపించారు. శ్రీలంక సముద్ర ప్రాంతాలు, అక్కడి జీవన విధానాన్ని కథలో భాగంగా తీసుకున్నారు. సినిమా మార్చి 13న థియేటర్లలో విడుదలైంది.సుకిర్తన్ క్రిస్తురాజా, జెనోసన్ రాజేశ్వర్ కలిసి 'ఆంటోనీ'కి దర్శకత్వం వహించారు. కథ, స్క్రీన్‌ప్లే పనుల్లో కూడా వీరిద్దరూ భాగమయ్యారు. ఓసై ఫిల్మ్స్ బ్యానర్‌పై కళైవళరి సాగ రామనాథస్, సుగంతిని నిర్మించారు. విజయ్ బాలసింగం, శ్రీకందరాజా, విక్కీ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. రిషి సెల్వం సినిమాటోగ్రఫీ అందించగా, సురేష్ ఏ ప్రసాద్ ఎడిటింగ్ చేశారు. ఇళయరాజా పాటలతో పాటు నేపథ్య సంగీతం కూడా అందించారు. తమిళంతో పాటు మూడు భాషల్లో సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది. థియేట్రికల్ రిలీజ్ తర్వాత అమెజాన్ ప్రైమ్ వీడియో, టెంట్‌కొట్టా సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో కూడా సినిమాను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రిపోర్ట్స్ పేర్కొన్నాయి. ఆస్కార్ కోసం భారత్ పంపిన సినిమాల లిస్ట్‌లో ఇళయరాజా సంగీతం గతంలోనూ ఉంది. కమల్ హాసన్ నటించిన 'దేవర్ మగన్'ను భారత్ 1992లో అధికారికంగా పంపింది. 2000లో కమల్ దర్శకత్వం వహించిన 'హే రామ్' కూడా భారత్ తరఫున ఆస్కార్‌కు వెళ్లింది. ఈ రెండు సినిమాలకు ఇళయరాజానే సంగీతం అందించారు. అయితే రెండూ చివరి నామినేషన్స్‌లో చోటు దక్కించుకోలేకపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన సంగీతం ఉన్న సినిమాలు ఆస్కార్ ప్రక్రియలోకి రావడం జరిగింది. 'గోంధల్' భారత్ నుంచి ఇప్పటికే ఎంపిక కాగా, 'ఆంటోనీ' శ్రీలంకలో ఇంకా దేశీయ సెలక్షన్ దశలోనే ఉంది.శ్రీలంక నేషనల్ ఫిల్మ్ కార్పొరేషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆస్కార్ కోసం సినిమాలను సమర్పించేందుకు సెప్టెంబర్ 21 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉంది. ఆ తర్వాత నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీ అర్హత ఉన్న సినిమాలను చూసి ఒక చిత్రాన్ని ఎంపిక చేస్తుంది. శ్రీలంక తరఫున 2027 ఆస్కార్‌కు వెళ్లే అధికారిక సినిమా ఏదో సెప్టెంబర్ 28న ప్రకటించనున్నారు.

## పశ్చిమాసియాలో టెన్షన్.. తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి - యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని, ఏ క్షణంలోనైనా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చవచ్చని హెచ్చరిస్తూ.. తన పౌరులకు కొత్త ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణాలు పెట్టుకోవాలనుకునే వారు తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని స్పష్టం చేసింది.అమెరికా విదేశాంగ శాఖ (స్టేట్ డిపార్ట్‌మెంట్) ఈ హెచ్చరికను విడుదల చేసింది. ఇప్పటికే పశ్చిమాసియాలో ఉన్న అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, విమానాలు రద్దు కావడం, గగనతలాలు మూసివేయడం వంటి ప్రయాణ అంతరాయాలకు సిద్ధంగా ఉండాలని సూచించింది. పశ్చిమాసియాకి లేదా ఆ మార్గం గుండా ప్రయాణించాలనుకునే వారు తమ ప్రణాళికలను తీవ్రంగా పునఃపరిశీలించుకోవాలని, విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరింది.ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలోని పౌర విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని ఈ అడ్వైజరీలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ ఘర్షణ "వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది" అని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్, దాని మద్దతు ఉన్న గ్రూపులు విదేశాల్లోని అమెరికా ప్రయోజనాలు, వ్యాపారాలు, సంస్థలను లక్ష్యంగా చేసుకోవచ్చని కూడా హెచ్చరించింది.సౌదీ రాజధాని రియాద్‌తో పాటు యాన్బు వంటి ఇతర సున్నిత ప్రాంతాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ హెచ్చరిక వెలువడింది. రాజధాని వైపు దూసుకొస్తున్న ఒక క్షిపణిని అడ్డుకున్నామని సౌదీ ఎయిర్ డిఫెన్స్ దళాలు తెలిపాయి. రియాద్ విమానాశ్రయం సమీపంలో పేలుళ్లు, పొగ కనిపించినట్లు వార్తలు వచ్చినా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సౌదీ అధికారులు ప్రకటించారు.ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల ముప్పు, సాయుధ ఘర్షణలు, ఉగ్రవాదం వంటి కారణాలతో సౌదీ అరేబియాపై ఇప్పటికే లెవెల్ 3 (ప్రయాణాన్ని పునఃపరిశీలించండి) అడ్వైజరీ కొనసాగుతోంది. ఇక యెమెన్‌పై లెవెల్ 4 (ప్రయాణం చేయవద్దు) హెచ్చరిక అమల్లో ఉంది. యెమెన్ సరిహద్దుకు సమీపంలో పనిచేసే అమెరికా ప్రభుత్వ ఉద్యోగులపై అదనపు ఆంక్షలు కూడా విధించారు.

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం



మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు.యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు."అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు.మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు."కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

## 'నేను ఎవరి బాణాన్ని కాను.. బహుజనుల బాణాన్ని'

మొదటిపేజీ తరువాయి - జూరాల హెడ్ రెగ్యులేటర్‌ను పగులగొట్టి మరీ నీళ్లు విడుదల చేసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. వరి, మొక్కజొన్న రైతులు తమ పంటను కొనమని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో మళ్లీ ఆత్మహత్యల తెలంగాణ కావాలా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ప్రజలకు పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తామని కవిత తెలిపారు. విద్య, వైద్య రంగాధ అభివృద్ధి కోసం రూ. లక్ష కోట్లు అయినా సరే వెనకాడకుండా ఖర్చు చేస్తామని హామీనిచ్చారు. పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. బాధ్యత లేని నాయకులు ఉన్నప్పుడు యువత బలమైన నాయకులుగా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పార్టీ నేతలేమో తాను కాంగ్రెస్ విడిచిన బాణమని, సీఎం రేవంత్ రెడ్డి ఏమో కల్వకుంట్ల కుటుంబం అవినీతి పేరుతో తాను బీఆర్ఎస్ (దీ=నా) విడిచిన బాణమని ప్రచారం చేస్తూ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. తాను ఎవరి బాణాన్ని కాదని, తెలంగాణ బహుజనుల బాణాన్ని అని స్పష్టం చేశారు. ఈ సభలో ప్రజా గాయకుడు గద్దర్ పాడిన 'భలేగుందిరో మన అసెంబ్లీ' పాటలోని చరణాలను పాడి నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపారు. ప్రజలంతా ఏకమై తెలంగాణ రక్షణ సేనను అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే, రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తామని కవిత పిలుపునిచ్చారు.



## సుడిదోమ ముప్పుకు ముందస్తు అడ్డుకట్ట..

# వరి రైతులకు 'మావిలాన్' భరోసా










### కూలీల కొరతను అధిగమిస్తూ తక్కువ శ్రమతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న నెల్లూరు రైతులు

నెల్లూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : వరి పంటపై చీడ పీడల దాడి జరిగితే పంట నష్టంతోపాటు రైతులు నెలల తరబడి చేసిన కష్టం, పెట్టుబడి, ఆశించిన ఆదాయం కూడా ప్రమాదంలో పడతాయి. ముఖ్యంగా సుడిదోమ ఉధృతి పెరుగుతుండటం, సకాలంలో పురుగుమందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకకపోవడం వరి రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో సులభంగా వినియోగించగలిగే, ఎక్కువకాలం సమర్థవంతమైన రక్షణనిచ్చే పంట సంరక్షణ పరిష్కారాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరి పంటకు ఉపయోగించే వినూత్న, గుళికల రూపంలోని పురుగుమందు మావిలోన్ పనితీరును వివరించేందుకు కోర్టేవా అగ్రిసైన్స్ సంస్థ నెల్లూరు జిల్లాలోని మావిలోన్ గుళికలు వాడిన వరి పైర్లలో ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వరి రైతులు, వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.సుడిదోమ, మోవిపురుగు ఆశించిన తర్వాత పలుమార్లు మందులు పిచికారీ చేయాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, ముందుగానే పంటకు రక్షణ కల్పించడం ఎలా సాధ్యమవుతుందనే అంశాన్ని ఈ కార్యక్రమంలో ప్రధానంగా వివరించారు. మావిలోన్ ఉపయోగించిన ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించిన రైతులు, వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు పంటలో కనిపించిన మార్పులను ప్రత్యక్షంగా గమనించారు. పురుగుల నియంత్రణతోపాటు బలమైన పిలకలు, ఆరోగ్యకరమైన పంట ఎదుగుదల, మెరుగైన గింజ నింపుదల కనిపించాయి. నాట్లు వేసిన 30 నుంచి 35 రోజుల మధ్య మావిలోన్ గుళికలు ఉపయోగిస్తే, సుడిదోమ నుంచి 60 రోజుల వరకు, మోవిపురుగు నుంచి 15 రోజుల వరకు రక్షణ లభిస్తుంది. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం జరగకముందే దిగుబడి సామర్థ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుంది.మావిలోన్ ఉపయోగించిన నెల్లూరు ఆదర్శ రైతు వీరారెడ్డి మాట్లాడుతూ, గతంలో సుడిదోమ, మోవిపురుగు ఉధృతి కనిపించిన ప్రతిసారీ తీవ్ర ఆందోళనకు గురయ్యేవాళ్లమని, మందులు పిచికారీ చేయడానికి కూలీలను సమకూర్చుకోవడం కష్టంగా ఉండేదని తెలిపారు. మావిలోన్ వాడిన తర్వాత ఆ పరిస్థితి మారిందని, పొలం ఆరోగ్యంగా ఉండటంతోపాటు గతంతో పోలిస్తే పంట మరింత బలంగా కనిపిస్తోందని చెప్పారు. మరో ఆదర్శ రైతు రమేష్ రెడ్డి మాట్లాడుతూ, మావిలోన్ వాడటం వల్ల పంటకు ముందుగానే రక్షణ ఏర్పడిందనే భరోసా కలిగిందని, ఆందోళన చెందకుండా పంట సాగుపై దృష్టి పెట్టగలిగానని అన్నారు. సాగు ఖర్చులు, కూలీల కొరత, పురుగుల ఉధృతి వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు పురుగు నియంత్రణ పద్ధతులకు ప్రాధాన్యం పెరుగుతోందని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు : టీడిపి

ప్యాపిలి (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అర్థరహిత ఆరోపణలు చేయడం మాని, ప్రభుత్వంపై మాట్లాడే ముందు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు వాస్తవాలు గ్రహించి ఆత్మవిమర్శ చేసుకోవాలని కూటమి నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గ్రామాలు, మండలాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర నిధులను సమర్థవంతంగా రాబట్టడంతో పాటు పెట్టుబడుల ఆకర్షణ, రోడ్లు, సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్య రంగాల విస్తరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అంతేగాక, పింఛన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వితంతువులు-దివ్యాంగులకు చేయూత, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్నామని, వీటిపై ప్రతిపక్ష నేతలు నిరాధార ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధమైన విమర్శలను ఆహ్వానిస్తామని, అయితే అవి వాస్తవాలు, రికార్డుల ఆధారంగా ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణలుగా మారకూడదని నేతలు పేర్కొన్నారు. అభివృద్ధి అనేది ఏ ఒక్క నాయకుడి సొంత ఆస్తి కాదని, ప్రజలు కట్టే పన్నులు, ప్రభుత్వ నిధులతోనే పనులు జరుగుతాయన్న సత్యాన్ని గుర్తించాలని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్న తరుణంలో బాధితులకు బాసటగా నిలవాల్సింది పోయి, వాటిని సైతం రాజకీయాలకు వాడుకోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పంటల బీమా ప్రీమియం, కేంద్ర-రాష్ట్ర వాటాలు, విపత్తుల నిర్వహణపై కనీస అవగాహన లేకుండా మీడియా ముందు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. గత పాలనలో తమ నాయకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలపై, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలపై వైఎస్సార్‌సీపీ నేతలకు అనుమానాలు ఉంటే తేదీ, స్థలం నిర్ణయించాలని, ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని




సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుదర్శన్, చైర్మన్ రాజా రేణుక, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి,మాజీ ఎంపీటీసీ రామ్మోహన్ యాదవ్,చల్లా వీరా,సిద్దపు పుల్లారెడ్డి, ఆర్.సి. మద్దిలేటి, కదిరప్ప, జనసేన క్రిష్టిపాడు చంద్ర, గుడిపాడు వెంకటరెడ్డి, కొంగనపల్లె మధు, నడిగడ్డ నాగేంద్ర, గండికోట రమేష్, వార్డు మెంబర్ వెంకటేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాల ఉలిగమ్మ భౌతికకాయానికి సి విజయలక్ష్మి నివాళి



ఎమ్మిగనూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : పట్టణంలో 30వ వార్డులో అనారోగ్యం కారణంగా మాల ఉలిగమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ పట్టణ కోశాధికారి సి.విజయలక్ష్మి మృతి చెందిన మాల ఉలిగమ్మ భౌతికకాయానికి పూల మాలవేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలన్నదే ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి సంకల్పమని, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబాన్ని తన కుటుంబంగా భావిస్తూ,ఆపద సమయంలో బాధితులకు భరోసా కల్పిస్తున్నారని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు మృతి చెందిన కుటుంబానికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ నాయకులు భీమన్న, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## "జన్మభూమి నుంచి కర్మభూమి" వరకు

# సేవా సంకల్ప్ బైక్ ర్యాలీ





### మోడీ 75వ జన్మదిన వేడుకల్లో పాల్గొనడం అదృష్టం: ఏపీ యువ నాయకుడు కొట్టె మల్లికార్జున

డోన్ (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల సేవా పాలనకు గుర్తుగా "జన్మభూమి నుంచి కర్మభూమి" వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ బైక్ ర్యాలీ యాత్రలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, దేశ ప్రధానిగా 12 ఏళ్లు మొత్తం 25 ఏళ్లుగా ప్రజాసేవలో తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మోడీ అని కొట్టె మల్లికార్జున కొనియాడారు. జాతీయ బీజేపీ అధ్యక్షులు నితిన్ నబీన్, జాతీయ యువ మోర్చా అధ్యక్షులు హేమంగ్ జోషి నేతృత్వంలో గుజరాత్ వాద్ నగర్ నుండి ఉత్తరప్రదేశ్ వారణాసి వరకు ఈ ర్యాలీ జరుగుతోంది.మీడియాతో కొట్టె మల్లికార్జున: "దేశం కోసం, ధర్మం కోసం, యువత కోసం పాలన చేస్తున్న మోడీ జీ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాం. మోడీ జీ 75వ జన్మదిన వేడుకల్లో భాగస్వాములు కావడం, ఈ బైక్ యాత్రలో పాల్గొనడం మా అదృష్టం" అని అన్నారు.ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మిట్టా వంశీ సూచనతో తాము గుజరాత్ కు వెళ్లినట్లు తెలిపారు.అవకాశం కల్పించిన మాధవ్, సునీల్ రెడ్డి, మిట్టా వంశీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరి, ఉపాధ్యక్షులు తోట సూర్యప్రకాష్ రెడ్డి లకు, గుజరాత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌతమ్ జీ కి, వాద్ నగర్ బీజేపీ, యువ మోర్చా నాయకులకు ఏపీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## సంజామల మండలం వైయస్సార్సీపి

# కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన. మాజీ ఎమ్మెల్యే. కాటసాని రామిరెడ్డి.









(స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : నంద్యాల. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండలం గిద్దలూరు శ్రీ సాయిరాం ఫంక్షన్ హాల్ నందు సంజామల మండల స్థాయి వైఎస్ఆర్సిపి కార్యకర్త సమావేశాన్ని నిర్వహించిన బనగానపల్లె మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి గారు. స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలంటూ వైఎస్సార్సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కార్డ్సన రామిరెడ్డి గారు. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులకు పంట నష్టపరిహారం ఇన్పుట్ సబ్సిడీ లు రైతులకు ఇచ్చారా సంజీవన మండలానికి కోట్లాది రూపాయలు నష్టపరిహారం అందించిన ఘనత వైఎస్ఆర్సిపి పార్టీది అని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గత వైఎస్ఆర్సిపి హయంలో సంజామల మండలంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేశాం 17 సర్పంచ్ స్థానాల్లో పదవి స్థానాలు వైయస్సార్సీపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించు ఉన్నాం. నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు పాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు స్థానిక ఎన్నికల్లో పట్టం కట్టిన ప్రజలు స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ఈరోజు కుటుంబ ప్రభుత్వానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారా ప్రభుత్వాలు ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చలేదు కుటుంబ ప్రభుత్వం అధికారులకు వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న నేటి కొత్త పింఛన్లు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం ఈ కూటం ప్రభుత్వాన్ని పెద్దవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అంటూ కుటుంబ నాయకులే డప్పు వాయించుకుంటున్నారు క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు గురించి ప్రజల వద్దకు వెళ్ళండి ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు 2024 ఎన్నికల్లో చెప్పిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా నెరవేర్చలేదు వైయస్సార్సీపీ కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేసినది సంజామల మండల వైయస్సార్ సిపి మండల పరిషత్ సభ్యుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా పరిషత్



సభ్యులను మరియు పదవీకాలం ముగిసిన సర్పంచ్ ఘనంగా సన్మానించిన బనగానపల్లె మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి గారు. ఐదు సంవత్సరాల కాలంలో ఎక్కడ అవినీతికి పాల్పడకుండా తమ పదవులను సమర్థవంతంగా నిర్వహించిన ప్రతి ఎంపీటీసీ సర్పంచులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి మల్కి రెడ్డి వెంకటసుబ్బారెడ్డి పోచ శిలా రెడ్డి ఎంపీపీ పోచమ్మ దేవి డి చిన్నబాబు ముదిగేడు రాజశేఖర్ రెడ్డి గారు నాగేశ్వర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి నరసింహారెడ్డి ఎస్సీ బాబు, అసత్ అలీ ఖాన్ సోమ సుందర్ రెడ్డి అన్యం శివరామిరెడ్డి తులసీశ్వర్ రెడ్డి సుధాకర్ రెడ్డి బత్తుల రామచంద్రారెడ్డి తోట వెంకటేశ్వర రెడ్డి నట్ల కొత్తూరు రవీందర్ రెడ్డి పోచ వెంకటరామిరెడ్డి సత్యమయ్య అక్కంపల్లి నాగేశ్వర్రెడ్డి కృష్ణారెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కేటీఆర్‌కి కోట్ల ఆస్తులు మీకు ఎలా వచ్చాయి: ఎంపీ చామల సూటి ప్రశ్న..

తెలంగాణ రాజకీయాల్లో భూములు, ఫామ్‌హౌస్‌ల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుకు సంబంధించినవిగా ఆరోపిస్తున్న అజీజ్ నగర్ భూములను కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఆదివారం ఫీల్డ్ విజిట్ చేపట్టింది. ప్రజా భవన్ నుంచి బయలుదేరిన నేతలు తొలుత అజీజ్ నగర్‌లోని ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి సంబంధించిన ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ బృందంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ యాదవ్, మల్లు రవి, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు ఉన్నారు.

## ఇండస్ట్రియల్ టూర్ కు ఆలూరు ప్రభుత్వ నెం 1 పాఠశాల విద్యార్థులు

### - విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్ నైపుణ్యం అత్యవసరం






ఆలూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : ఇండస్ట్రియల్ టూర్ లో భాగంగా ఆలూరు ప్రభుత్వ నెం 1 పాఠశాల 9 మరియు 10 వ తరగతి విద్యార్థులు శనివారం రోజున ఆదోని బీమా ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఆ కళాశాలలో మెకానిక్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ ల్యాబ్లను సందర్శించి కంప్యూటర్ మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి వివరించారు.అదేవిధంగా ఇంజనీరింగ్ ల్యాబ్ లను సందర్శించి ఆయా విభాగాల ప్రొఫెసర్లు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. విద్యార్థులకు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని ఆలూరు హెచ్ఎం సుధారాణి తెలిపారు. ప్రభుత్వ నెం 1 పాఠశాల విద్యార్థులను వొకేషనల్ ఎడ్యుకేషనల్ లో భాగంగా ఆదోని బీమా ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యుకేషన్ సెంటర్ కు శనివారం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సాయి. ముర్తుజ్ వలి,పాల్గొన్నారు.

## పుల్లాసి లక్ష్మన్న మృతి పార్టీకి తీరని లోటు : మాజీ మంత్రి బుగ్గన



ప్యాపిలి(స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : చిన్న పూదేళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు పుల్లాసి లక్ష్మన్న ఆకస్మిక మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆదివారం ?లక్ష్మన్న మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన చిన్న పూదేళ్ల గ్రామానికి చేరుకుని, ఆయన మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మన్న మృతి చెందడం గ్రామానికి, పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా బుగ్గన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నేతలు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రామచంద్రుడు, భువనేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము, ప్రభాకర్ రెడ్డి, చిన్న రామంజి, ఎర్రి స్వామి,చెన్నకేశవులు, కమతం వెంకటేశ్వరరెడ్డి, రమేష్, బొలికొండ,బంగి నాగరాజు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'భారతీయం' వేదికగా మంత్రి నారా లోకేష్‌తో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆత్మీయ భేటీ



కాకినాడ, (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : కాకినాడ: కాకినాడలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేష్‌ను ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆత్మీయంగా పలకరించి కార్యక్రమం నిర్వహణ, లక్ష్యాలపై చర్చించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాల ప్రాధాన్యతపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు.'భారతీయం' వంటి కార్యక్రమాల ద్వారా యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువల పట్ల అవగాహన పెంపొందించేందుకు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు చేపట్టిన చర్యలను కూడా చర్చించారు.ఈ ఆత్మీయ భేటీలో విద్యార్థుల భవిష్యత్తు, విద్యా రంగంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువతలో విలువల ఆధారిత విద్యను ప్రోత్సహించే అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నట్లు పేర్కొన్నారు.

## సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఘనంగా రెడ్‌క్రాస్ మెడికల్ క్యాంప్

### 150 మందికి పైగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ.






కావలి(స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 20 : కావలి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 150 మందికి పైగా విద్యార్థినులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి డాక్టర్ మేఘనాథ్ సౌజన్యంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జాహ్నవి స్కిన్ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఉషారాణి, పుల్లారెడ్డి నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీలక్ష్మి పాల్గొని విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు.అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కౌమార దశలో బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కె. హరినారప రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ హాస్టల్ కమిటీ అధ్యక్షురాలు ఎస్.స్వర్ణలత,ప్రతినిధి బోరెడ్డి రజని,హాస్టల్ వార్డెన్లు ప్రసూన, సునీత,మంజుల,ఆశా వర్కర్లు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో రోజూ స్టాక్ మార్కెట్లలో నష్టం.. నెస్లే ఇండియాకు భారీ పతనం..!



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా నాలుగో రోజు నష్టాలతో ముగిశాయి. తొలుత లాభాలతోనే సూచీలు ట్రేడయినా బ్యాంకింగ్ స్టాక్స్ పతనం కావడంతో నష్టాలతోనే ముగిశాయి. అమెరికా ద్రవ్యోల్బణం ఆందోళనకర రీతిలోనే కొనసాగుతుండటంతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గించే విషయమై మరింత జాప్యమయ్యే సంకేతాలు వెలువడటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది.ఫలితంగా బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 455 పాయింట్లు (0.63శాతం) నష్టపోయి, 72,489 పాయింట్ల వద్ద నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 152 పాయింట్ల నష్టంతో 21,996 పాయింట్ల వద్ద స్థిర పడింది. సెన్సెక్స్'లో నెస్లే ఇండియా, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్ స్టాక్స్ 2-3శాతం నష్టపోగా, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్ స్టాక్స్ కూడా నష్టాలతోనే ముగిశాయి.నెస్లే ఇండియా తన మిల్క్ పొడిలో పంచదార కలిపిందని ఆంగ్ల దిన పత్రికలో వచ్చిన వార్తలను కేంద్రం సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. దీంతో నెస్లే ఇండియా షేర్ భారీగా నష్టపోయింది. జస్ట్ డయల్ గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 32 శాతం గ్రోత్ సాధించి రూ.115.6 కోట్ల నికర లాభం గడించిందన్న వార్తలతో ఆ సంస్థ షేర్ 13 శాతం పుంజుకున్నది. ఇక దేశీయ స్టాక్ మార్కెట్ లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ గురువారం రూ.లక్ష కోట్లు తగ్గి రూ.393.26 లక్షల కోట్లకు పడిపోయింది. బీఎస్ఈ 30 ఇండెక్సులో 1930 స్టాక్స్ నష్టాలతో, 1867 స్టాక్స్ లాభాలు గడించగా, 132 స్టాక్స్ యధాతథంగా ముగిశాయి.

## వాట్సాప్‌లో ఇంట్రెస్టింగ్ ఫీచర్.. ఆన్‌లైన్‌లో ఎవరు ఉన్నారో చెప్పేస్తుంది



ప్రతీ ఒక్కరి స్మార్ట్ ఫోన్‌లో కచ్చితంగా ఉండే యాప్స్‌లో వాట్సాప్ ముఖ్యమైంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ కలిగిన యాప్స్‌లో ఇదీ ఒకటి.ఎప్పటికప్పుడు యూజర్ల అవసరాలకు అనుగుణంగా కొంగొత్త ఫీచర్లను తీసుకొస్తుంది కాబట్టే వాట్సాప్‌కు ఇంతటి ఆదరణ లభిస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా వాట్సాప్ మరో ఇంట్రెస్టింగ్ ఫీచర్‌ను తీసుకొచ్చే పనిలో పడింది.సాధారణంగా వాట్సాప్‌లో మనకు తెలిసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో ఉన్నాడో లేదో ఎలా తెలుస్తుంది.? ఇందుకోసం సదరు వ్యక్తి ప్రొఫైల్‌ను క్లిక్ చేసి చూడాలి. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఉంటే ఆన్‌లైన్‌లో ఉన్నట్లే లేదంటే లాస్ట్ సీన్ ఎప్పుడుందో కనిపిస్తుంది. మరి అలా కాకుండా ఆన్‌లైన్‌లో ఎవరెవరు ఉన్నారో వారి జాబితాను ఒకచోట చూపిస్తే ఎలా ఉంటుంది.? అచ్చంగా ఇలాంటి ఫీచర్‌నే తీసుకొచ్చే పనిలో పడింది వాట్సాప్. ప్రస్తుతం ఈ ఫీచర్ టెస్టింగ్ స్టేజ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం వాట్సాప్‌లో మనం ఎవరితోనైనా చాట్ చేయాలంటే కింద కుడివైపు ఉండే 'ప్లస్' సింబల్‌ను క్లిక్ చేసి చాట్‌ను సెలక్ట్ చేసుకొని మెసేజ్ చేస్తుంటాం. వాట్సాప్ తీసుకురానున్న ఈ కొత్త ఫీచర్ సహాయంతో 'ప్లస్' బటన్‌పై క్లిక్ చేయగానే ఆన్‌లైన్‌లో ఎవరు ఉన్నారో ఒక లిస్ట్ ప్రత్యక్షమవుతుంది. 2.24.9.14 వెర్షన్‌తో ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఈ కొత్త ఫీచర్ బీటా టెస్టింగ్ జరుగుతోంది. ఎవరైతే రీసెంట్‌గా ఆన్‌లైన్‌లో ఉన్నారో వారి వివరాలను ఒక చోట చూపిస్తుంది.మరో ఫీచర్..ఇక స్టేటస్‌కు సంబంధించిన వాట్సాప్ మరో ఇంట్రెస్టింగ్ ఫీచర్‌ను పరిచయం చేయనుంది. యూజర్ల ఎంగేజ్‌మెంట్ కోసం ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొస్తోంది. మన కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వారు ఎవరైనా కొత్తగా స్టేటస్ పెడితే వెంటనే పలానా వ్యక్తి స్టేటస్ పెట్టినట్లు మీకు ఒక నోటిఫికేషన్ వస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను పరీక్షిస్తున్నారు. త్వరలోనే యూజర్లందరికీ ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చే పనిలో పడింది వాట్సాప్.

## పవర్‌ఫుల్ ల్యాప్‌టాప్‌లు.. కేవలం 20 వేల లోపే.. అద్భుతమైన ఫీచర్స్



7 జనరేషన్ /14 11. ఈ ల్యాప్‌టాప్ ధర రూ. 89,990 అయినప్పటికీ మీరు దీన్ని అమెజాన్‌లో రూ.17,990కి పొందవచ్చు. ఈ ల్యాప్‌టాప్‌పై యజమాని 6 నెలల వారంటీ కూడా ఇచ్చారు.మీరు 11.6-అంగుళాల డిస్‌ప్లే, స్టోరేజీ, 11తో ల్యాప్‌టాప్‌ను చాలా చౌక ధరలో పొందవచ్చు. దీని ధర రూ. 28,990 అయినప్పటికీ మీరు దీన్ని అమెజాన్‌లో రూ. 18,990కి పొందవచ్చు.640: మీరు 10వ తరం ల్యాప్‌టాప్‌ను కేవలం రూ. 16,799కి పొందవచ్చు. మీకు కావాలంటే మీరు దీన్ని నో కాస్ట్ పై కూడా కొనుగోలు చేయవచ్చు. దాని నెలవారీ కోసం మీరు



కేవలం రూ. 814 చెల్లించాలి. ఈ ల్యాప్‌టాప్ టచ్‌స్క్రీన్ ఫీచర్‌తో వస్తుంది.: మీరు ఈ 14 అంగుళాల డెల్ ల్యాప్‌టాప్‌ను కేవలం రూ. 21,974కి పొందవచ్చు. మీరు ఎటువంటి ఖర్చు లేకుండా 11 (అప్‌గ్రేడ్ చేసిన) ల్యాప్‌టాప్‌ను కూడా కొనుగోలు చేయవచ్చు. దీని నెలవారీ రూ. 1,065 మాత్రమే.15: ఈ ల్యాప్‌టాప్ అసలు ధర రూ. 33,990 అయినప్పటికీ, మీరు దీన్ని నుండి 38 శాతం తగ్గింపుతో కేవలం రూ. 20,990కి కొనుగోలు చేయవచ్చు. ఈ ల్యాప్‌టాప్ పైన పేర్కొన్న ల్యాప్‌టాప్‌ల మాదిరిగా సెకండ్ హ్యాండ్ కాదు.

## అమెరికలో కలవర పెడుతున్న భారత విద్యార్థుల మరణాలు..ఎఫ్ఐడీఎస్ సీరియస్!

గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 11 మంది విద్యార్థులు వేర్వేరు పరిస్థితిల్లో అమెరికాలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఒక్కసారిగా యావత్ భారత్ తీవ్ర భయాదోళనలు వ్యక్తం చేసింది.నిజానికి మన దేశం నుంచి వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకై అమెరికా వైపుకే మొగ్గు చూపుతుంటారు. ఇప్పుడు ఆ దేశం సురక్షితమేనే అనే సందేహాలు అందరిలోనూ మెదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా మరణాలపై దర్యాప్తు చేస్తున్న ప్రవాస భారతీయులకు సంబంధించిన ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్(ఎఫ్ఐఐడీఎస్) చాలా షాకింగ్ విషయాలు వెల్లడించింది.ఈ ఘటనలు పునారావృత్తం కాకుండా యూఎస్ అధికారులు, విశ్వవిద్యాలయాలు సంస్థలు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరింది. అంతేగాదు అమెరికాలో ఉండే భద్రతపై పరిజ్ఞానం లేకపోవడం వల్ల పర్యావరణ మరణాలు(మోనాక్సైడ్ విషప్రయోగం, అల్పోష్ణస్థితి), ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరిపించే మానసిక సమస్యలు వల్ల అనుమానాస్పద మరణాలు, హింసాత్మక నేరాలు జరిగినట్లు సర్వేలో వెల్లడించింది. ఆయా కారణాల వల్ల బాధిత విద్యార్థులు మరణాలకు కారణమని ఎఫ్ఐఐడీఎస్ సర్వేలో తేలిందియూఎస్‌లో విద్య అనేది చాలామంది భారతీయ విద్యార్థుల కల అని పేర్కొంది. ఈ భయానక ఘటనలు ఒక్కసారిగా భారత సంతతి విద్యార్థులు, వారి కుటంబాల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తించాయని వెల్లడించింది. ప్రస్తుతం యూఎస్‌లో దాదాపుగా రెండు లక్షలకు పైగా భారత సంతతి విద్యార్థులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం విదేశీ విద్యార్థులలలో సుమారు 25% మంది విద్యార్థుల నుంచి ఫీజులు, ఖర్చులు రూపంలో అమెరికా దాదాపు రూ. 900 కోట్లు వరకు ఆర్జిస్తోందని ఎఫ్ఐఐడీఎస్ చీఫ్ ఖండేరావ్ కాండే అన్నారు. ఈ మరణాలు పెరిగినట్లయితే ఆ ఆదాయానికి గండి పడే అకాశాలు ఉండటమే గాక యూఎస్ విశ్వవిద్యాలయాల భద్రతపై తీవ్ర స్థాయిలో అనుమానాలు వ్యక్తం అయ్యే ప్రమాదం లేకపోలేదని ఎఫ్ఐఐడీఎస్ హెచ్చరించింది.అంతేగాదు దీన్నే అదనుగా చూసుకుని కొందరూ అమెరికా సమాజంపై ద్వేషపూరిత నేరాలకు ఆజ్యం పోసి భారతీయ అమెరికా కమ్యూనిటీ చుట్టూ పుకార్లు వ్యాపించేలా చేస్తున్నట్లు ఎఫ్ఐఐడీఎస్ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్ఐఐడీఎస్ భారతీయ అమెరికన్ విద్యార్థులు ఆందోళనలు, భద్రతకు సంబంధించిన సర్వేను ప్రారంభించింది. ఆసక్తిగల భారత సంతతి విద్యార్థులు ఈ ఎప్ఐఐడీఎస్ వెబ్‌సైట్‌లోని సర్వేలో పాల్గొని తామ ఎదుర్కొంటున్న భయాందోళనలు గురించి వెల్లడించాలని పిలుపునిచ్చింది.అంతేగాదు అంతర్జాతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న భద్రత, శ్రేయస్సుకి సంబంధించిన ఆందోళనలు పరిష్కరించేలా యూఎస్ అధికారులు కొన్ని చర్యలు తీసుకోవాలని కోరింది ఎఫ్ఐఐడీఎస్సురక్షిత విద్యను పెంపొందించడం: చాలామంది విదేశీ విద్యార్థులుకు తాము ఉన్న నిర్థిష్ట ప్రాంతాల్లో జరిగే నేరాలు, ప్రమాదాల పట్ల అవగాహన ఉండకపోడచ్చు . అందువల్ల విద్యాపరంగా సురక్షితంగా ఉండే ప్రాంతాల్లో ఉండేలా నిర్ణయాలు తీసుకునేలా సమాచారం అందించడం లేదా శక్తిమంతంగా ఎలా ఎదుర్కొవాలే అవగాహన కల్పించడం వంటివి చేయాలి.రెస్క్యూ విధానాలు మెరుగుపరచడం: అత్యవసర పరిస్థితుల్లో లేదా ప్రమాదంలో ఉన్న విద్యార్థుల భద్రత లేదా వారి క్షేమం నిర్థారించేలా తక్షణ ప్రతిస్పందన, సమర్థవంతమైన రెస్క్యూ విధానాలు చాలా ముఖ్యమైనవి. దీని వల్ల అంతర్జాతీయ విద్యార్థుల ప్రమాదాలను నియంత్రించగలుగుతాం. తద్వార విద్యారుల జీవితాలను కాపాపడి వస్తారు.

# పిల్లల పైచదువులకు భరోసా.. ఇలా బంపర్ రిటర్న్స్.. 21 ఏళ్లు వచ్చే వరకు చేతికి రూ. 20 లక్షలు!




భారత్‌లో ద్రవ్యోల్బణం అంతకంతకూ పెరిగిపోతోంది. అన్ని ఖర్చులూ పెరిగిపోతున్నాయి. పిల్లల చదువుల ఖర్చులు కూడా ప్రతి సంవత్సరం 7 నుంచి 10 శాతం పెరుగుతున్నాయి. మరోవైపు క్షీణిస్తున్న రూపాయి విలువ కూడా దీనికి అదనం అని చెప్పొచ్చు. ఒకప్పటితో పోల్చితే పిల్లల ఉన్నత చదువుల ప్రణాళిక ఇప్పుడు ఇంకా క్లిష్టంగా మారింది.మయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని 15 గెలుచుకోండిడీల్స్ చూడండిసమయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని %భూప్త్రశీఅవ% 15 గెలుచుకోండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!డీల్స్ చూడండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!అమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపుడీల్స్ చూడండిఅమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపు: ద్రవ్యోల్బణం ప్రతి నెలా పెరుగుకుంటూ పోతున్న తరుణంలో పిల్లల చదువులు కూడా భారంగా మారుతున్నాయి. దీంతో ఈ ఆర్థిక సవాలును అధిగమించడానికి ఏం చేయాలనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. దీనికి మనం ఇప్పుడు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. భారతీయుల ఆర్థిక ప్రణాళికల్లో పిల్లల చదువులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. బడిలో చేరినప్పటి నుంచి మొదలుకొని.. ఉన్నత విద్య వరకు మొత్తం ఎంత కావాలో ముందుగానే ఆలోచించాల్సిన అవసరం ఉంది. అందుకోసం పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పటి నుంచే.. దీర్ఘకాలిక దృష్టితో ఎక్కువ రాబడి అందించే పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించాలి. అప్పుడు మాత్రమే ఎలాంటి చిక్కులు లేకుండా పిల్లల్ని ఉన్నత చదువులు చదివించడంలో తల్లిదండ్రులు విజయం సాధించొచ్చు.కాస్త పేరున్నటువంటి బడిలో పిల్లల్ని చేర్పించాలంటే సంవత్సరానికి రూ. 1.5 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇతర ఖర్చులు అదనం. స్కూల్‌లో చేర్చినప్పట్నుంచి.. ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు ఖర్చు ఎంతవుతుందన్నది అంచనా ముందే వేస్కోవాలి. దీనితో ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలనే విషయంపై స్పష్టత వస్తుంది.మొత్తం ఒకేసారి అవసరం ఉండదు కాబట్టి.. దశల వారీగా ఎప్పుడు ఎంత మొత్తం కావాలన్నది తెలుసుకుంటే.. దానికి అనువైన పథకాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు వీలవుతుంది. పిల్లల అవసరాలకు పెట్టుబడులు పెట్టేటప్పుడు.. లాంగ్ టర్మ్‌లో మంచి రిటర్న్స్ అందించే వాటినే ఎంచుకోవాలి.పిల్లల చదువుల కోసం పెద్ద మొత్తంలో కూడబెట్టేందుకు ఒక పథకంపైనే ఆధారపడితే చాలదు. సేఫ్‌గా ఉండే రికరింగ్ డిపాజిట్లు మొదలు.. ఎక్కువ నష్టభయం ఉండే షేర్ల వరకు పెట్టుబడులు పెడుతుండాలి. ఈక్విటీ ఫండ్స్‌తో సహా డెట్ పథకాల్ని ఎంచుకోవాలి. ఎక్కువ నష్టభయం ఉండే ఈక్విటీ స్కీమ్స్‌కు ఎంత కేటాయించాలి.. సురక్షిత పథకాలకు ఎంత మళ్లించాలనేది కూడా కీలకం. 10-12 సంవత్సరాల వ్యవధి ఉన్నప్పుడు.. ఈక్విటీ ఆధారిత పెట్టుబడుల్ని ఎంచుకోవాలి. నాలుగైదేళ్లలోనే డబ్బు వెనక్కి రావాలనుకుంటే డెట్ పథకాల్ని పరిశీలించాలి.ఫండ్లలోనూ మదుపు..పిల్లల ప్రత్యేక అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీలు కూడా ప్రత్యేక పథకాల్ని తీసుకొస్తున్నాయి. చైల్డ్ గిఫ్ట్ ప్లాన్, చైల్డ్ కెరీర్ ప్లాన్ వంటివి ఉంటాయి. సెబీ రూల్స్ ప్రకారం వీటికి ఐదేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. లేకపోతే పిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు పథకాలు ఉంటాయి. ఈక్విటీల్లో 65 శాతం, డెట్ ఫండ్లలో 35 శాతం వరకు మదుపు చేస్తాయి. వీటిల్లో కాస్త రిస్క్ ఉన్నప్పటికీ.. లాంగ్ టర్మ్‌లో మంచి రిటర్న్స్ వస్తాయని చెప్పొచ్చు.పిల్లల పేరిట పాలసీలతో.తల్లిదండ్రుల మొదటి ప్రాధాన్యం పిల్లల కోసం పొదుపు చేయడమే. అందుకోసమే పలు పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తుంటారు. పిల్లల అవసరాలకు మొత్తం డబ్బు అందుబాటులో ఉంటుందని ఏ పథకం కూడా హామీ ఇవ్వదు. పీపీఎఫ్, మ్యూచువల్ ఫండ్లు, బంగారం, షేర్లు, రియల్ ఎస్టేట్ దేంట్లోనైనా మనం పెట్టుబడి పెడుతూ వెళ్తేనే దీర్ఘకాలంలో లాభాలు అందిస్తాయి.ఉదాహరణకు ఏడాది వయసున్న అమ్మాయి లేదా అబ్బాయికి 21 ఏళ్లు వచ్చే వరకు చేతికి రూ. 20 లక్షలు కావాలనుకుందాం. దీని కోసం పేరెంట్స్.. 12 శాతం వార్షిక రాబడి వచ్చే పథకాల్లో సంవత్సరానికి కనీసం రూ. 25 వేల వరకు మదుపు చేయాల్సి ఉంటుంది. దీనిని కూడబెట్టేందుకు ఎలాంటి అనుకోని పరిస్థితులు కూడా అడ్డురావొద్దు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండాలంటే.. పిల్లల కోసం ప్రత్యేకంగా ఉన్న బీమా పాలసీల్ని ఎంచుకోవాలి. పాలసీల్ని కూడా పిల్లల చదువులో భాగం చేస్తే.. ఒకవేళ కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలోనూ వారి చదువు అవాంతరం ఏర్పడదు.

# అంచనాల్ని మించినా ఇన్ఫోసిస్‌కు పెద్ద దెబ్బ.. పడిపోతున్న షేరు.. టార్గెట్ ప్రైస్ తగ్గింపు!




దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. గురువారం రోజు నాలుగో త్రైమాసికం ఫలితాల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. కంపెనీ నికర లాభం రూ. 7969 కోట్లుగా నమోదు కాగా.. ఇది అంచనాల్ని మించి రాణించిందని పేర్కొంది. మొత్తం రూ. 28 డివిడెండ్ కూడా ప్రకటించింది. అయితే అంచనాల్ని మించి రాణించినప్పటికీ.. ఇన్ఫోసిస్ స్టాక్ శుక్రవారం సెషన్‌లో పతనం అవుతోంది.సమయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని 15 గెలుచుకోండిడీల్స్ చూడండిసమయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని 15 గెలుచుకోండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!డీల్స్ చూడండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!అమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపుడీల్స్ చూడండిఅమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపుదేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ క్యూ4 (జనవరి- మార్చి) ఫలితాల్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే కంపెనీ ఫలితాల్లో అంచనాల్ని మించి రాణించినా కూడా.. స్టాక్ మాత్రం శుక్రవారం సెషన్లో పడిపోతోంది. సెషన్ ఆరంభంలోనే తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటోంది. స్టాక్ మార్కెట్ సూచీలు కూడా పతనం అవుతున్నాయి. ఆరంభంలో భారీ నష్టాలు ఉండగా.. క్రమక్రమంగా కోలుకుంటున్నాయి. ఈ వార్త రాసే సమయంలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 160 పాయింట్ల నష్టంతో 72 వేల 300 మార్కు పైన ట్రేడవుతోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ స్వల్ప నష్టాలతో 21 వేల 950 మార్కు వద్ద కొనసాగుతోంది.ఇన్ఫోసిస్ స్టాక్ ఇవాళ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న క్రమంలో ఇంట్రాడేలో 3 శాతం వరకు నష్టపోయింది. కిందటి సెషన్లో సంస్థ ఫలితాలకు ముందు స్వల్ప లాభాల్లో ముగిసిన ఇన్ఫోసిస్.. ఇవాళ మాత్రం ప్రారంభంలోనే 2 శాతానికిపైగా నష్టపోయింది. కిందటి సెషన్‌లో షేరు రూ. 1419.25 వద్ద ముగియగా ఇవాళ రూ. 1385 వద్ద ఓపెన్ అయింది. తర్వాత కూడా ఇంట్రాడేలో అలాగే కొనసాగింది. రూ. 1378.75 వద్ద సెషన్ కనిష్టాన్ని తాకింది.ప్రస్తుతం వార్త రాసే సమయంలో ఒక శాతానికిపైగా పతనంతో రూ. 1403.65 వద్ద ఉంది. ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 5.81 లక్షల కోట్ల వద్ద ఉంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 1733 కాగా.. కనిష్ట విలువ రూ. 1215 గా ఉంది.ఇన్ఫోసిస్ మంచి ఫలితాలనే నమోదు చేసినప్పటికీ.. భవిష్యత్తులో వృద్ధికి దోహదం చేసేలా చర్యలు కనిపించలేదని విశ్లేషిస్తున్నారు నిపుణులు. పాజిటివ్ బిజినెస్ అవుట్‌లుక్‌ను మెయింటెయిన్ చేయలేకపోతోందని.. ఇది బలహీన ఫలితాల్ని సూచిస్తుందని చెబుతున్నారు.నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన ఇన్ఫోసిస్ సంస్థకు 30 శాతం పెరిగి రూ. 7969 కోట్లు వచ్చినప్పటికీ.. ఆదాయంలో మాత్రం అంచనాల్ని అందుకోలేదు. దాదాపు 13 బ్రోకరేజీ సంస్థలు సగటున రూ. 38,413 కోట్లు సమీక్షా త్రైమాసికంలో ఆదాయం వస్తుందని అనుకున్నా.. అది రూ. 37,923 కోట్లుగానే నమోదైంది.ప్రస్తుతం స్టాక్ పడిపోతున్నా.. కొన్ని బ్రోకరేజీ సంస్థలు ఇప్పటికీ బై రేటింగ్, న్యూట్రల్ రేటింగ్ కొనసాగిస్తున్నాయి. అయితే టార్గెట్ ప్రైస్ మాత్రం తగ్గించడం గమనార్హం. దీంతో రానున్న రోజుల్లో ఈ స్టాక్ ధర మరింత పడిపోయే ప్రమాదం ఉందన్నమాట. అంతకుముందు ఇచ్చిన టార్గెట్ ప్రైస్‌ను కాస్త తగ్గించాయి. అయినప్పటికీ చాలా వరకు ప్రస్తుత ధరతో పోలిస్తే 10 శాతానికిపైగానే ఎక్కువ ఉందని చెప్పొచ్చు.టార్గెట్ ప్రైస్ ఇలా..నువామా టార్గెట్ ప్రైస్‌ను రూ. 1720 గా అంచనా వేసింది. బై రేటింగ్ ఇచ్చింది. ఇది ప్రస్తుత ధరతో పోలిస్తే 21 శాతం ఎక్కువే. జెఫరీస్ టార్గెట్ ప్రైస్ రూ. 1630గా, మోతీలాల్ ఓస్వాల్ రూ. 1650 గా అంచనా వేసింది. నోమురా మాత్రం న్యూట్రల్ రేటింగ్ ఇచ్చి టార్గెట్ ప్రైస్ ప్రస్తుతం ఉన్న రూ. 1400 గా నే పేర్కొనడం గమనార్హం. ప్రభుదాస్ లిల్లాధర్ .. ఇన్ఫీ టార్గెట్ ప్రైస్‌ను రూ. 1375 గా పేర్కొంది. ఇది ప్రస్తుత ధరతో పోలిస్తే ఇంకా తక్కువ.


## డ్రాగన్‌పై గురిపెట్టి.. ఫిలిప్పిన్స్‌కు బ్రహ్మోస్త్రాన్ని అప్పగించిన భారత్.. ఇక ఆట మొదలు..!

మన పొరుగున ఉన్న చైనాకు మన పట్ల ఎంత అక్కసు వెళ్లగక్కుతుందో తెలిసిందే. భారత్‌ను దెబ్బతీయడం కోసం అది ఏం చేయడానికైనా వెనుకాడదు. పాకిస్థాన్‌తో చెలిమి చేస్తూ.. ఆ దేశానికి ఆయుధాలను విక్రయించడంతోపాటు మన పొరుగు దేశాలన్నింటినీ తన వైపు తిప్పుకుంటున్న సంగతి కూడా తెలిసిందే. చైనాకు చెక్ పెట్టడం కోసం భారత్ ఇప్పుడు దాని శత్రు దేశాలను తన వైపు తిప్పుకుంటోంది. కీలకమైన ఆయుధాల విక్రయించేందుకు కూడా ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.ప్రధానాంశాలు:ఫిలిప్పిన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అప్పగించిన భారత్2022 జనవరిలోనే ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంచైనాతో ముప్పు నేపథ్యంలో భారత్‌ను ఆశ్రయించిన ఫిలిప్పిన్స్వరమయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని15 గెలుచుకోండిడీల్స్ చూడండిసమయం తెలుగు లక్కీ డ్రాలో పాల్గొని 15 గెలుచుకోండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!డీల్స్ చూడండిగర్భిణుల్లో కాళ్ల వాపు తగ్గించే ఆహారాలు..!అమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపుడీల్స్ చూడండిఅమెజాన్‌లో ఏప్రిల్ 18 వరకు మెగా ఎలక్ట్రానిక్స్ డేస్ ఎ టాప్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్ ఇంకా మరెన్నో వాటిపై 80% వరకు తగ్గింపుభారత్ ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆయుధ దిగుమతిదారు అనే సంగతి తెలిసిందే. ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో 11 శాతం వాటా మనదే. ఓ పాకిస్థాన్, మరో పక్క చైనా.. ఇంకో పక్క ఉగ్రవాదం నుంచి ఎదురవుతోన్న సవాళ్లను ఎదుర్కోవడానికి మన దేశం సైన్యాన్ని పటిష్టం చేయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తోంది. అందులో భాగంగానే రష్యా,



అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి అత్యాధునిక ఆయుధాలను కొనుగోలు చేస్తోంది. ఇన్నాళ్లపాటు ఆయుధాల దిగుమతులకే పరిమితమైన భారత్.. ఇప్పుడు ఆయుధాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.భారత్ తాజాగా తోటి ఆసియా దేశమైన ఫిలిప్పిన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను ఎగుమతి చేసింది. భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ సూపర్ సోనిక్ మిస్సైళ్లను ఫిలిప్పిన్స్ మెరైన్ కార్పొరేషన్‌కు అప్పగించింది. బ్రహ్మోస్ మిస్సైల్ సిస్టమ్ శుక్రవారం ఫిలిప్పిన్స్‌కు చేరుకుంది. బ్రహ్మోస్ క్షిపణుల కోసం భారత్, ఫిలిప్పిన్స్ మధ్య 2022 జనవరిలోనే 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందంలో భాగంగా మూడు ఎక్స్‌పోర్ట్ వేరియంట్ల బ్రహ్మోస్ మిస్సైల్ వెపన్ సిస్టమ్‌లను మనీలాకు అందజేశారు. ఒక్కో సిస్టమ్‌లో రెండు మిస్సైల్ లాంఛర్లతోపాటు ఓ రాడార్, ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉంటాయి. ఈ మిస్సైల్ లాంఛర్ల నుంచి పది సెకన్ల వ్యవధిలో రెండు మిస్సైళ్లను ప్రయోగించొచ్చు. ఈ క్షిపణులను నేల మీది నుంచి మాత్రమే కాకుండా.. జలాంతర్గాములు, నౌకలు, ఎయిర్‌క్రాఫ్టల నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరిన రెండేళ్ల తర్వాత తొలి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులు భారత్ నుంచి ఫిలిప్పిన్స్ చేరాయి.భారత్ ఆయుధాలను ఎగుమతి చేయడం ఇదే ప్రథమం కాదు. డోర్నియర్-228 ఎయిర్‌క్రాఫ్ట్, ఆర్టిల్లరీ గన్స్, ఆకాశ్ మిస్సైళ్లు, రాడార్లు, పినాక రాకెట్లు, థర్మల్ ఇమేజర్లు తదితర చిన్న చిన్న ఆయుధాలను భారత్ ఇప్పటి దాకా ఎగుమతి చేసింది. కానీ ఫిలిప్పిన్స్‌తో కుదుర్చుకున్న బ్రహ్మోస్ ఒప్పదం భారత్‌కు అతిపెద్ద మిలటరీ ఎగుమతుల ఒప్పందమని చెప్పొచ్చు.ఇది కేవలం ఆయుధాల ఎగుమతి.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి మాత్రమే పరిమితమైన ఒప్పందం కాదు. చైనాను నిలువరించే ప్రయత్నాల్లోనూ ఇదో ముందడుగు కానుంది. ఎందుకంటే.. చైనాకు సరిహద్దు వివాదాలు మన దేశానికే పరిమితం కాలేదు. దాదాపుగా పొరుగున ఉన్న అన్ని దేశాలతోనూ డ్రాగన్‌కు వివాదాలున్నాయి. ఇక దక్షిణ చైనా సముద్రం విషయంలోనైతే తైవాన్ నుంచి ఇండోనేసియా దాకా ఆ సముద్రంతో తీరం పంచుకుంటోన్న పలు దేశాలతో చైనాకు వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు ఫిలిప్పిన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం తర్వాత.. ఈ ప్రాంతంలో భారత్ నుంచి ఆయుధాల కొనుగోలుకు మిగతా దేశాలు కూడా ముందుకొచ్చే అవకాశం ఉంది.అమెరికా, ఫ్రాన్స్, రష్యా, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారులుగా ఉన్నాయి. రష్యా ప్రస్తుతం ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా ఇతర దేశాలకు ఆయుధాలను ఎగుమతి చేసే పరిస్థితుల్లో లేదు. ఇక అమెరికా ఆయుధాల ధర చాలా ఎక్కువ. ఫ్రాన్స్ విషయంలోనూ ధర అవరోధంగా మారుతుంది. చైనా ఆయుధాల ధర తక్కువే అయినప్పటికీ.. వాటి విశ్వసనీయత ప్రశ్నార్థకం. ఈ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకొని.. ఆయుధాలను ఎగుమతి చేసే టాప్-10 దేశాల్లో ఒకటిగా మారే దిశగా భారత్ అడుగులేస్తోంది.

## వాట్సాప్‌లో మరో ఇంట్రెస్టింగ్ ఫీచర్. ఇక ఆ సమస్యలకు చెక్




ఇటీవల కాలంలో యువత ఎక్కువగా వాట్సాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెటా యాజమన్యంలోని వాట్సాప్ కూడా వినియోగదారుల మంచి అనుభూతిని ఇవ్వాలనే లక్ష్యంతో కొన్ని నెలలుగా అనేక ఫీచర్లపై పని చేస్తోంది.వాట్సాప్ తాజాగో మరొక ఫీచర్‌ను అప్‌డేట్ చేసే అవకాశం ఉందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది మీరు ముందుగా ఎవరికి టెక్ట్స్ చేయాలో నిర్ణయించడంలో మీకు సహాయపడవచ్చని చెబుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్‌లో ఉన్న పరిచయాల జాబితాను మీకు చూపే ఫీచర్‌పై వాట్సప్ పని చేస్తుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాట్సాప్ తాజా ఫీచర్ గురించి వివరాలను తెలుసుకుందాం.వాట్సాప్ బీటా వినియోగదారులకు ఇటీవల ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లో యాక్టివ్‌గా ఉన్న పరిచయాల జాబితాను చూపుతుంది. ఇటీవల ఆన్‌లైన్‌లో ఉన్న కొన్ని ఎంపిక చేసిన పరిచయాలు మాత్రమే ఈ జాబితాలో చూపుతాయని గమనించాలి. మీరు మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లో ఇటీవల ఎవరు యాక్టివ్‌గా ఉన్నారో? మీ టెక్ట్స్‌లకు సమాధానం ఇవ్వడానికి లేదా ముందుగా మీ కాల్‌లను పికప్ చేసే అవకాశం ఉన్నవారిని తనిఖీ చేయాలనుకుంటే ఈ ఫీచర్ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ఫీచర్ ప్రతి కాంటాక్ట్‌కు సంబంధించిన కార్యాచరణ స్థితిని వ్యక్తిగతంగా తనిఖీ చేయాల్సిన అవసరాన్ని తీసివేయడం ద్వారా వినియోగదారుల సందేశ అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. వినియోగదారుల గోప్యతను దృష్టిలో ఉంచుకుని బీటా సమాచార నివేదిక ఈ జాబితాలలో వినియోగదారులు చివరిసారిగా చూసిన మరియు ఆన్‌లైన్ స్థితిని చూపదు.ప్రస్తుతానికి గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్ కోసం వాట్సాప్ బీటాకు సంబంధించిన తాజా వెర్షన్‌కి అప్‌డేట్ చేసే ఎంపిక చేసిన బీటా టెస్టర్‌ల సమూహానికి కొత్త ఫీచర్ అందుబాటులో ఉంది. రాబోయే వారాల్లో ఇది మరింత మంది వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. మీ పరిచయాలతో ఇంటరాక్ట్ అయ్యేలా ప్రోత్సహించడానికి కమ్యూనికేషన్ అనుభవాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించబడింది. చాట్‌ల జాబితా దిగువన ఉంచబడిన ఈ ఫీచర్ వినియోగదారులకు వారి కొనసాగుతున్న చాట్‌లకు అంతరాయం కలిగించకుండా సంభావ్య కొత్త సంభాషణలకు అప్రయత్నంగా యాక్సెస్‌ను అందిస్తుంది. కొత్త చాట్‌లను ప్రారంభించడం కోసం సూచనలను స్వీకరించకూడదని ఇష్టపడే వినియోగదారులు చాట్‌ల జాబితా దిగువన ఉన్న ప్రత్యేక విభాగాన్ని మూసివేయడం ద్వారా సులభంగా నిలిపివేయవచ్చు.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com